



మాక్ డ్రిల్ చేస్తున్న ఫైర్ సిబ్బంది

అగ్నిప్రమాదం జరిగిన తర్వాత
ప్రతీక్షణం విలువైంది

- వెంటనే 101 నంబర్‌కు ఫోన్‌చేయాలి
- జిల్లా అగ్నిమాపక అధికారి సారంగి సందన్న

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత ప్రతిక్షణం ఎంతో విలువైందని, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా 101కి ఫోన్ చేసి అగ్నిప్రమాద సమాచారాన్ని ఫైర్ స్టేషన్‌కు ఇవ్వాలని జిల్లా అగ్నిమాపక అధికారి సారంగి సందన్న ప్రజలకు సూచించారు. తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ, సివిల్ డిఫెన్స్ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ, సివిల్ డిఫెన్స్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వాటిని ఆపేందుకు అగ్నిమాపక సిబ్బంది వద్ద ఉన్న సౌకర్యాలను ప్రజల ముందు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ గుండయ్యతో కలిసి జిల్లా అగ్నిమాపక అధికారి సందన్న మాట్లాడారు. ఈనెల 14 నుంచి 20 వరకు ప్రభుత్వ ఆదేశాలతో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. తమ పరిసరాల్లో ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా 101 ఫోన్ చేసి స్పష్టంగా చిరునామాతో సహా తమకు తెలియజేయాలని కోరారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన మాక్ డ్రిల్‌లో పాల్గొన్న ఫైర్ సిబ్బందిని ఆయన అభినందించారు.



వాసవి మాఇల్లు స్వచ్ఛంద సంస్థకు చెందిన ట్యాంకర్ ద్వారా సంగారెడ్డిలో తాగునీటి సరఫరా

గొంతెండకుండ

మండుటెండల్లో మానవత


తాగునీరు, మజ్జిగ, అంబలి, నిమ్మరసం పంపిణీ

ఉమ్మడి మెదక్ వ్యాప్తంగా చలివేంద్రాల ఏర్పాటు

స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, వ్యక్తుల దాతృత్వం

మరిన్ని చోట్లా ప్రారంభిస్తే పాదచారులు, ప్రయాణికులకు ఊరట

వేసవి వచ్చిందంటేనే తడారిన గొంతులు దాహం కోసం తపిస్తుంటాయి. ఇల్లు దాటితే తాగునీటి కోసం డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితే. ఇక ఆర్థిక స్థోమత లేని వారు వాటర్ బాటిళ్లను కొనుగోలు చేయడానికి తర్జనభర్జన పడుతుంటారు. ఇలాంటి వారి దాహార్తిని తీర్చడానికి కొంతమంది స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. చల్లటి తాగునీటి చలివేంద్రాలే కాకుండా అంబలి, నిమ్మరసం, మజ్జిగ పానీయాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఏళ్ల తరబడిగా మండుటెండల్లో మానవత్వాన్ని చాటుతున్న వారిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..



'సంగారెడ్డి పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను గట్టెక్కించడానికి తనవంతు సాయంగా వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తోపాజీ అనంతకిషన్ ముందడుగు వేశారు. తమ సంస్థ తరఫున ఒక వాటర్ ట్యాంకర్ కొనుగోలు చేసి నిత్యం తాగునీటిని అందిస్తున్నారు. ఆయన ధాతృత్వాన్ని కలెక్టర్ క్రాంతి వల్లూరు సైతం ప్రశంసించి మరొక ట్యాంకర్‌ను ఏర్పాటు చేయాలని కోరడంతో ప్రస్తుతం రెండు ట్యాంకర్లతో నిరంతరం తాగునీరు సరఫరా చేయిస్తున్నారు'.

'కొమురవెల్లి మండలం కిష్టంపేటకు చెందిన బొంగు రాజేందర్‌రెడ్డి సిద్దిపేట పట్టణంలో వ్యాపారం నిర్వహిస్తుంటారు. వేసవి రాగానే 45రోజుల పాటు మజ్జిగ, నిమ్మరసం కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. బీఆర్ఆర్ సేవాసంస్థ ద్వారా ఉచితంగా నిత్యం సుమారు 500 మందికి స్వచ్ఛమైన నిమ్మరసం పంపిణీ చేస్తున్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ సమీపంలోనూ చలివేంద్రాన్ని ప్రారంభించి భక్తులకు ఉపశమనం కలిగిస్తున్నారు.'

'మెదక్‌లోని మాతా బోరంచమ్మ ఆలయం ఆధ్వర్యంలో ఉగాది నుంచి సుమారు 110 రోజుల పాటు నిత్యం అంబలి పంపిణీ చేస్తున్నారు. ప్రతీ మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద భోజనంతోపాటు అంబలి అందజేస్తూ మండుటెండల్లో మానవత్వం చాటుతున్నారు. రోజుకు దాదాపు 700 మంది ఉచితంగా అంబలి సేవిస్తున్నారు. గత ఐదు సంవత్సరాలుగా నిరాటంకంగా సేవ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు'

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 15: ప్రస్తుతం ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. కొద్దిరోజులుగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుతున్న పరిస్థితి. వేసవి ప్రతాపానికి తాళలేక వడదెబ్బతోనూ చనిపోయినవారు, అస్వస్థతకు లోనైనవారు ఉన్నారు. ఇలాంటి ఆపత్కాల పరిస్థితుల్లో సామాజిక సేవను చాటుతూ కొందరు ఆదర్శంగా నిలుస్తున్నారు. గడిచిన 15 రోజుల నుండి మెతుకుసీమలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛంధంగా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే మరికొందరు కూడా ఈ కోణంలో ముందుకు రావాల్సిన అవసరం ఉంది. జనసంచార ప్రాంతాల్లో దాహం తీరక ఇబ్బందులు పడేవాళ్లు ఎందరో ఉన్నారు. ఆ సమయంలో చలివేంద్రాలు, మజ్జిగ, అంబలి, నిమ్మరసం కేంద్రాలే ఆసరాగా నిలుస్తున్నాయి.

దప్పిక తీర్చడమే లక్ష్యంగా..

- చిలప్‌చెడ్ మండలం గౌతపూర్ గేటు వద్ద గ్రామ యువత ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి కుండల ద్వారా చల్లటి నీళ్లు అందిస్తున్నారు.
- హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ మండలాల్లో జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాటర్ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేసి నీళ్లు పంపిణీ చేస్తున్నారు.
- సత్యసాయిసేవా సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలుచోట్లా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.
- గజ్వేల్ పట్టణానికి చెందిన అమర నాగేందర్, జగ్గయ్యగారి శ్రీనివాస్‌లు సొంత ఖర్చులతో చలివేంద్రాలు ప్రారంభించారు.
- నాగల్‌గిద్ద మండలం ముక్తాపూర్ చౌరస్తా, వల్లూరు శివారుల్లో దాతలు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.
- కల్హేర్‌లో మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి సాయిలు తన తల్లిదండ్రుల పేరిట అంబలి కేంద్రం నిర్వహిస్తున్నారు.
- కుకునూరుపల్లి బస్టాండ్ వద్ద బీజేపీ నేతలు చలివేంద్రం ప్రారంభించారు.
- మాసాయిపేట మండల కేంద్రంలో పోతన్‌శెట్టిపల్లికి చెందిన వెన్నవరం శ్రీనివాస్‌రెడ్డి గత ఎనిమిదేళ్లగా తన సొంత ఖర్చులతో తాగునీరు అందిస్తున్నారు.
- చిన్నశంకరంపేట మండల కేంద్రంలో ఎన్నారై కంజర్ల చంద్రశేఖర్ రెండు చలివేంద్రాలను

మిగతా 7వ పేజీలో..

రోజూ 30వేల లీటర్ల తాగునీరు పంపిణీ



వాసవి మాఇల్లు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ వేసవిలో నాలుగు నెలలు రోజూ 30వేల లీటర్ల తాగునీటిని సంగారెడ్డి పట్టణంలో పంపిణీ చేస్తున్నాం. మున్సిపల్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ తాగునీటి ఎద్దడి ప్రతీ కాలనీకి నీరు చేరవేస్తున్నాం.

-తోపాజీ అనంతకిషన్,
వాసవీ మాఇల్లు స్వచ్ఛందసంస్థ, అధ్యక్షుడు

చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతిరెడ్డి మాట్లాడుతూ ఎవరికైనా న్యాయపరంగా సమస్య ఉంటే వెంటనే డయల్ 15100కు ఫోన్ చేసి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆశ్రయించాలని సూచించారు. తాము కౌన్సెలింగ్ చేస్తామని, అప్పటికీ న్యాయం జరగనప్పుడు సరైన న్యాయ సలహాలు అందిస్తామని చెప్పారు. మహిళలకు న్యాయసేవలు ఉచితమని, ఇతరులకు మాత్రం నిబంధనలు పాటిస్తూ సలహాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విమలక్క

ఆపరేషన్ కగార్‌తో
రక్తమోడుతున్న దండకారుణ్యం

- నక్సల్స్‌తో ప్రభుత్వం చర్చలు జరిపి ప్రజా సమస్యలను పరిష్కరించాలి
- ప్రజా గాయకురాలు విమలక్క

7

ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు!



- కొత్తగా 119 మంది విధుల్లోకి..
- త్వరలో వారి చేతికి స్టీరింగ్
- డ్రైవర్ల కొరత దృష్ట్యా ఆర్టీసీ చర్యలు

7

అనువర్తిత జానపదంపై అధ్యయనం పెరగాలి

- జానపద సాహిత్యంపై జాతీయ సదస్సు షురూ

7



ఆన్‌లైన్ వేదికగా మాట్లాడుతున్న వక్తలు



కలెక్టరేట్‌లో పోషణ్ పక్షం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా (ఫైల్)

ఆరోగ్యమే లక్ష్యం

- జిల్లాలో పోషణ్ పక్వాడా ప్రారంభం
- 22 వరకు అంగన్‌వాడీల్లో వారోత్సవాలు
- పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన
- జిల్లాలో 1,150 అంగన్‌వాడీ కేంద్రాలు

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పోషణ్ పక్వాడా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలలో పోషకాహార లోపాన్ని గుర్తించి.. నివారించే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహార విలువలు, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈనెల 8న ప్రారంభమైన ఈ అవగాహన కార్యక్రమాలు 22 వరకు కొనసాగనున్నాయి. జిల్లాలోని ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,150 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు ఐదేళ్లలోపు చిన్నారులు 31,112 మంది ఉన్నారు.

తల్లిపాల ఆవశ్యకత..

అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శిశువు జన్మించిన మొదటిరోజు వెయ్యి రోజుల వరకు ప్రాముఖ్యతను వివరించడం, పౌష్టికాహారం లోపంతో ఉన్న చిన్నారులను గుర్తించడం, అనుబంధ పోషకాహారం కార్యక్రమానికి రిజిస్ట్రేషన్ చేయడం వంటివి చేస్తారు. ఇప్పటికే మహిళాభివృద్ధి, శిశు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో గర్భిణుల బరువు, గర్భిణుల సంరక్షణపై భర్తలకు గ్రామస్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు రెండేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు. 15 రోజులపాటు కార్యక్రమాలు రోజుకొకటి చొప్పున పోషకాహార లోపాన్ని నివారించడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నారు. ఈ పక్షోత్సవాల్లో అంగన్‌వాడీ టీచర్లతో పాటు వైద్య, ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామపంచాయతీ, తదితరుల శాఖ అధికారులు, సిబ్బంది భాగస్వాములు అవుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..




గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకునే పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ కేంద్రం పరిధిలో పోషకాహార లోపం, ఇతర లోపం ఉన్నవారిని గుర్తిస్తాం. వారి పర్యవేక్షణతో పాటు పోషకాహారం అందిస్తాం.

- లక్ష్మీకాంత్‌రెడ్డి,
జిల్లా సంక్షేమ శాఖ అధికారి

'ఇందిరమ్మ' చెక్కులొచ్చాయ్!

- జిల్లాలోనే మొదటి చెక్కు పంపిణీ చేసిన మంత్రులు

కోహెడ/సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 15: సిద్దిపేట జిల్లాలోనే మొట్టమొదటిగా హుస్నాబాద్ నియోజకవర్గంలో కోహెడ పోరెడ్డిపల్లికి చెందిన దబ్బెడ రాజవ్వకు, సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామం గోపగాని లచ్చవ్వకు ఇందిరమ్మ ఇల్లు పథకం కింద మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం రూ.లక్ష చెక్కులను అందజేశారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పనులు బేస్‌మెంట్ వరకు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు మొదటివిడతగా రూ.లక్ష చెక్కును అందజేసే ప్రక్రియన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి వీరి ఇరువురికి మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో గృహ నిర్మాణశాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చెక్కులు అందజేశారు.



ఇందిరమ్మ ఇల్లు కింద మొదటి విడతగా రూ.లక్ష చెక్కును అందజేస్తున్న మంత్రులు

చేర్యాల మార్కెట్‌యార్డుకు ధాన్యం వెల్లువ

- కొనుగోళ్ల కోసం రైతుల ఎదురుచూపులు
- గన్నీబ్యాగులు సమకూర్చడంలో జాప్యం

చేర్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల వ్యవసాయ మార్కెట్‌యార్డుకు ధాన్యం వెల్లువలా వస్తుంది. సీజన్‌లో ముందస్తుగా సాగుచేసిన వరి చేతికిరావడంతో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందేందుకు రైతులు యార్డుకు తీసుకొస్తున్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఇటీవల ప్రారంభించడంతో చాలారోజుల క్రితం నుంచి రైతులు తమ ధాన్యాన్ని తీసుకొచ్చి ఆరబెడతున్నారు. అయితే, కొనుగోళ్లు ఇంకా చేపట్టకపోవడంతో రైతులకు పడిగాపులు తప్పడం లేదు. ఈ క్రమంలో అకాల వర్షాలతో రైతులు ఒకింత ఆందోళన చెందుతున్నారు.



రైతులకు అందించకుండా షెడ్‌లో ఉంచిన జల్లియంత్రాలు



చేర్యాల మార్కెట్‌యార్డులో ధాన్యం

మరికొంత మంది రైతులు వడగళ్ల నుంచి తప్పించుకునేందుకు పంటను యార్డుకు తరలిస్తున్నారు. చాలారోజుల క్రితం తీసుకొచ్చిన ధాన్యం నిర్ణీత తేమశాతానికి చేరుకున్న క్రమంలో కొనుగోళ్లు చేపడితే ఇతర రైతులకు కూడా అవకాశం దక్కుతుంది. ఇతర గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ఇటీవల గన్నీ సంచులు సరఫరా చేసినప్పటికీ పెద్దకొనుగోలు కేంద్రమైన చేర్యాల సెంటర్‌కు సరఫరా చేయకపోవడంతో కాంటా పెట్టడం లేదని చెబుతున్నారు. ఇలా ఇబ్బందులు పడే బదులు కాస్త తక్కువ ధరకైనా ధాన్యం అమ్ముకునేందుకు పలువురు రైతులు సంసిద్ధమవుతున్నారు. ఈనేపథ్యంలో సంబంధిత అధికారులు, మార్కెట్ కమిటీ పాలకవర్గం స్పందించి త్వరితగతిన గన్నీసంచులు సమకూర్చి కాంటా పెట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

బీఆర్ఎస్ సభకు పాదయాత్ర

- వెయ్యి మంది విద్యార్థులతో పార్టీ ఆవిర్భావ సభకు..
- కమిటీలు వేసిన హరీశ్‌రావు

సిద్దిపేట, ఆంధ్రజ్యోతి ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో బహిరంగ సభ కోసం రెండు కమిటీలు నియమించినట్లు మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 25 ఏళ్ల గులాబీ జెండాకు ఒక ప్రత్యేకత చాటుకునేలా సిద్దిపేట నుంచి వెయ్యి మంది విద్యార్థులతో పాదయాత్ర కోసం నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కమిటీ సమన్వయకర్తగా పూజల వెంకటేశ్వర్‌రావు, సభ్యులుగా ప్రభాకర్‌వర్మ, కోల రమేష్, శ్రీహరియాదవ్, భూమయ్యగారి కిషన్‌రెడ్డి, మెరుగు మహేష్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. సిద్దిపేట నుంచి మొదలయ్యే యువ విద్యార్థి పాదయాత్రకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, 14 ఏళ్ల పోరాట స్ఫూర్తి, పదేళ్ల అభివృద్ధికి దిక్సూచిగా నిలిచిన సిద్దిపేట, 25 ఏళ్ల పార్టీ జెండా పుట్టిన గడ్డ ప్రత్యేకత ఈపాదయాత్రలో కనిపించాలని సూచించారు. నియోజకవర్గం నుంచి బహిరంగ సభకు వెళ్లే వాహనాలను ఏర్పాటు చేసేందుకు రవాణా సౌకర్యాల కమిటీని నియమించినట్లు స్పష్టం చేశారు. కమిటీలో పార్టీ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఆర్‌టీఏ సభ్యుడు ఇర్షాద్‌హుస్సేన్‌లను నియమించినట్లు వివరించారు. సిద్దిపేట నుంచి వెళ్లే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా వాహన ఏర్పాటులో ఇబ్బందులు ఉండకుండా చూడాలని చెప్పారు.

ఆగమప్ప ఆర్ట్స్ అదరహో..



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మనువడితో ఉన్న చిత్రాన్ని గీసి ఎంపీ సురేష్ షెట్కార్‌తో కలిసి బహూకరిస్తున్న ఆగమప్ప

● మాటలు రాకున్నా.. చిత్రాలు గీయడంలో దిట్ట

● శభాష్ అనిపించుకుంటున్న కడ్పల్ గ్రామ యువకుడు

నారాయణఖేడ్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే మాటలు రాక పోయినా.. పట్టుదలతో శ్రమించి, చిత్రాలు వేస్తూ పెన్సిల్ ఆర్ట్‌కు జీవం పోస్తున్నాడు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పరిధిలోని సిర్గాపూర్ మండలం కడ్పల్ గ్రామానికి చెందిన ఆగమప్ప. గూడురు శ్రీశైలం, గూడురు మల్లమ్మలకు మొదటి సంతానమైన అతడు పుట్టుకతోనే మూగ. ఆగమప్పకు చదువు అంటే చాలా ఇష్టం. గ్రామంలోనే పదవతరగతి వరకు చదివాడు. అనంతరం ఇంటర్, బీకాం పూర్తి చేశాడు. మాటలు రాక పోయిన తాను కూడా పలువురితో ఔరా అనుపించుకోవాలనే పట్టుదలతో పెన్సిల్ ద్వారా చిత్రాలు వేయడం స్వయంగా నేర్చుకున్నాడు. ఇప్పటి వరకు 500ల వరకు పెన్సిల్ ఆర్ట్ చిత్రాలను వేశాడు. ఆగమప్ప ఎవ్వరినైనా చూడగానే పది నిమిషాల్లో వారి చిత్రాన్ని పెన్సిల్‌తో ఉన్నది ఉన్నట్లుగా చక్కగా వేస్తాడు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అయోధ్య బాలరాముడి చిత్రాలు, శివాజీ మహారాజ్, అంతర్గాం పీఠాధిపతి కరణ్‌గజేంద్ర భారతి మహారాజ్, మల్లన్న గుట్ట పీఠాధిపతి బసవలింగ మహారాజ్, వ్యాస మహర్షి చిత్రాలతో పాటు అనేక చిత్రాలను తన పెన్సిల్ తో చక్కగా వేశారు. మాటలు రాక పోయినా నిరాశకు లోను కాకుండా చిత్రాలకు ప్రాణం పోస్తున్నాడు. విధి వక్రీకరించినా పట్టుదల ఉంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చునని నిరూపిస్తున్నాడు ఆగమప్ప. నారాయణఖేడ్ ప్రాంతానికి ప్రముఖులు ఎవ్వరూ వచ్చిన ఆగమప్ప నిమిషాల్లో పెన్సిల్ ఆర్ట్‌తో చిత్రాన్ని వేసి బహూకరిస్తాడు.




ఆగమప్ప గీసిన చిత్రాలు



రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు మృతి

● లారీ ఢీకొనడంతో

నుజ్జు, నుజ్జు అయిన శరీర భాగాలు

కల్హేర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రెండు మూడు రోజుల్లో తండ్రి కాబోతున్నానన్న ఆనందంతో కొడుకు, చాలా రోజులకు తమ ఇంట్లో సంతానం కలుగుతుందన్న తల్లి ఆనందాన్ని మృత్యువు రూపంలో వచ్చిన లారీ చిదిమేసింది. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గ్రామం వద్ద 161వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకులు మరణించారు. మృతులు మెదక్ జిల్లా రేగోడ్ మండలం పట్టి పోలం తాండాకు చెందిన లావుడియా సక్రిబాయి(58), లావుడియా సుభాష్(25)గా గుర్తించారు. ద్విచక్ర వాహనంపై తమ తాండా నుంచి కామారెడ్డి జిల్లా బాన్సువాడ సమీపంలోని సుభాష్ అత్తగారి తాండాకు వెళ్తున్నారు. గర్భవతి అయిన సుభాష్ భార్య రెండు, మూడు రోజుల్లో ప్రసూతి అయ్యే అవకాశాలు ఉండటంతో అత్తగారి వద్ద ప్రసూతి ఖర్చుల కోసం డబ్బులు తీసుకువచ్చేందుకు తల్లి సక్రిబాయితో కలిసి వెళ్తుంగా, వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను లారీ బలంగా ఢీకొనడంతో తల్లి, కొడుకులు అక్కడిక్కడే మరణించారు. వారి శరీర బాగాలు నుజ్జు, నుజ్జు కావడంతో గుర్తుపట్టలేనంతగా మారిపోయాయి. సమాచారమందుకున్న కల్హేర్ పోలీసుల సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టమ్ కోసం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న కల్హేర్ పోలీసులు దర్యాప్తు జేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు.. ఒకరి మృతి



భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

శివ్వంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన సంగారెడ్డి గజ్వేల్ జాతీయ రహదారి దొంతి గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన సీతాల వెంకటేష్(40) భార్య సుమలతతో కలిసి తూప్రాన్ ఆసుపత్రిలో బంధువులను పరామర్శించడానికి బైక్‌పై వెళ్తున్నాడు. దొంతి శివారులోని బ్రిడ్జి వద్దకు రాగానే గజ్వేల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీఎస్ 15 యూబీ1300) గజ్వేల్ నుంచి సంగారెడ్డి వైపు అతి వేగంగా రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనాస్థలంలో భార్య భర్త మృతదేహంపై పడి రోధించడం పలువురిని కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వెంకటేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ సలీంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుకర్ రెడ్డి తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..

పుల్‌కల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పుల్కల్ ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం రామోజీపల్లి గ్రామానికి చెందిన దంతెల సాయిరాజ్ (30), దంతెల బాలయ్య (39) బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. స్వగ్రామంలో సోమవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతికి హాజరై రాత్రి బైక్‌పై తిరిగి బయలుదేరారు. రాత్రి 12 గంటలకు శివంపేట శివారులోని బీరు పరిశ్రమ వద్దకు రాగానే జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న దంతెల బాలయ్య (39) తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, దంతెల సాయిరాజ్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రేవతి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..



గోపాల్ (ఫైల్)

పాపన్నపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం మండల పరిధిలోని నర్సింగరావుపల్లి తండాకు చెందిన లునావత్ గోపాల్(39) మహిళా వేషధారణలో అడుక్కుంటూ జీవనం సాగిస్తుండేవాడు. రోజు మాదిరిగానే ఈ నెల 12న ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం చెరువులో గోపాల్ మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. స్నానం కోసం వెళ్లి చెరువులో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య సరిత, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

అత్యాచారం, హత్యాయత్నం కేసులో

నిందితుడి అరెస్టు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

జోగిపేట రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మహిళపై అత్యాచారం చేసి, ఆపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను మంగళవారం జోగిపేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ అనిల్ వెల్లడించారు. వట్‌పల్లి మండలానికి చెందిన ఓ మహిళ తను కొనుగోలు చేసిన చీరకు డ్యామేజ్ ఉండడంతో తిరిగి ఇచ్చేందుకు ఇటీవల జోగిపేటలోని బట్టల షాపు వెళ్లింది. ఈ క్రమంలో మనూర్ మండలం బెల్లాపూర్ గ్రామానికి చెందిన నరేష్‌రెడ్డి ఆమెతో పరిచయం పెంచుకుని ఇంటి వద్ద దించుతానని నమ్మబలికి తన స్కూటీపై ఎక్కించుకుని వెళ్లాడు. మార్గమధ్యలో మద్యం కొనుగోలు చేసి అందోల్ మండలంలోని అన్నసాగర్ శివారులో మద్యం సేవించి ఆమెపై అత్యాచారం చేశాడు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణమై వట్‌పల్లి మండలం నాగులపల్లి గ్రామ శివారులోకి రాగానే ఆమె చెవి కమ్మలు లాక్కొని కత్తితో దాడికి యత్నించాడు. ప్రతిఘటించిన ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ చేస్తుండగా.. వెంటనే కాలువలోకి తోసివేసి మెడలో ఉన్న చైన్, ఫోన్‌ను లాక్కొని పారిపోయాడు. మరుసటి రోజు బాధితురాలు వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరం ఒప్పుకోవడంతో రిమాండ్ పంపించినట్లు సీఐ తెలిపారు.

నెలలు నిండని గర్భిణి 108లో ప్రసవం


అంబులెన్స్‌లో తల్లీబిడ్డలు

కొండపాక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నెలలు నిండని గర్భిణికి 108 అంబులెన్స్ సిబ్బంది సుఖ ప్రసవం చేసి తల్లి బిడ్డలను ప్రాణాపాయస్థితి నుంచి కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మారెడ్డిపల్లి శివారులో ఓ ఫామ్ హౌస్‌లో ఒడిస్సాకు చెందిన సురేందర్ కుటుంబంతో నివాసముంటున్నారు. ఆయన భార్య త్రివేణికి నెలలు నిండకుండానే మంగళవారం పురిటి నొప్పులు వచ్చాయి. సురేందర్ ఇచ్చిన సమాచారం మేరకు అక్కడి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ ఆమెను పరిశీలించారు. పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోకి కూడా తీసుకువచ్చే పరిస్థితి లేకపోవడంతో అక్కడే సుఖ ప్రసవం చేశారు. పుట్టిన మగబిడ్డ తక్కువ బరువు ఉండడం.. ఎటువంటి చలనం లేకపోవడంతో పరిస్థితిని 108 ప్రధాన కార్యాలయం వైద్యుడు పార్థసారధికి సిబ్బంది సమాచారం అందించారు ఆయన సూచనలతో బిడ్డకు సీపీఆర్ చేసి కాపాడారు. అనంతరం తల్లిబిడ్డలను సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అంబులెన్స్ సిబ్బందిని పలువురు అభినందించారు.

'డంపుయార్డు అనుమతులు రద్దు చేయండి'


అధికారులు వినతిపత్రాలను అందజేస్తున్న ప్రజలు

గుమ్మడిదల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్‌లో డంపుయార్డు ఏర్పాటు అనుమతులు రద్దు చేయాలని ప్రజలు అధికారులకు విన్నవించారు. డంపుయార్డు ఏర్పాటు విషయంలో ప్రభుత్వం ఈ నెల 3న ప్రజాఅభిప్రాయం కోరింది. దీంతో కొత్తపల్లి, నల్లవల్లి గ్రామస్థులు ఇప్పటికే డంపుయార్డు మాకొద్దు అంటూ అధికారులకు వినతి పూర్వకంగా అభిప్రాయాన్ని తెలిపారు. మిగిలిన గ్రామాల ప్రజలు డంపుయార్డుకు వ్యతిరేకంగా మంగళవారం గుమ్మడిదల రెవెన్యూ కార్యాలయ అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. మరోవైపు గుమ్మడిదల మండల కేంద్రంలో రిలే నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. అనంతారం గ్రామానికి చెందిన యాదవ సంఘం సభ్యులు దీక్షలో కూర్చొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ జైపాల్ రెడ్డి, మండల నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, మద్దుల బాల్ రెడ్డి, సదానంద రెడ్డి, మొగులయ్య, భిక్షపతి రెడ్డి, యాదిరెడ్డి, గోపాల్, సూర్యనారాయణ, యాదయ్య, రాజు, రామ్ రెడ్డి, పెంటయ్యమండల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కవి వెంకట్‌కు ఘన సన్మానం


కవి వెంకట్‌ను సన్మానిస్తున్న శతావధాన నిర్వాహకులు

చేర్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన పద్యకవి వెంకట్ శతావధాన ప్రాశ్నిక సన్మానం అందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం, అవధాన విద్యావికాస పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళామందిరంలో సంపూర్ణ శతావధానం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ వర్ణన అనే అంశంలో ప్రశ్నలను సంధించారు. ఈ మేరకు ఆయనను నిర్వాహకులు ప్రశంసాపత్రం అందించి సత్కరించారు.








ప్రారంభం కాకుండానే పాడవుతున్నాయ్..

మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోని చిల్డ్రన్ పార్కు

నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుతున్న వైనం

రూ.కోట్లు వృథా

సదాశివపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సదాశివపేట పట్టణంలోని చిల్డ్రన్ పార్కు ప్రాంభానికి ముందే శిథిలావస్థకు చేరుతున్నది. బల్దియా రూ.2కోట్ల వ్యయంతో అధునాతనంగా, అద్భుతంగా నిర్మించింది.. కానీ మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. రాజకీయ నాయకుల మధ్య విభేదాలే ఇందుకు కారణంగా తెలుస్తున్నది. శతాబ్దాల ఘన చరిత్ర ఉన్న సదాశివపేటలో ఒక్క పార్కు కూడా లేదు. ప్రస్తుతం నిర్మించిన ఈ పార్కు కూడా ప్రారంభానికి నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నది. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎంతో కళాత్మకంగా తీర్చిదిద్దిన పార్కు పార్కులోని బొమ్మలన్నీ నిర్వహణ లేక ధ్వంసమవుతున్నాయి. పార్కులో.. ఏనుగుల విగ్రహాల దంతాలు ఊడిపోయాయి. నెమళ్ల ఈకలు నేల రాలిపోయాయి. కొంగల ముక్కులు విరిగిపోయాయి. కోతుల తోకలు కత్తిరించబడ్డాయి. జింకల కొమ్ములు, తాబేళ్ల ఆనవాళ్లు కనిపించడం లేదు. జీవవైవిధ్యానికి అద్దం పట్టే జంతువులు, పక్షుల బొమ్మలు రంగులు తేలిపోయాయి. ముచ్చటగా మూడేళ్లగా పార్కు అంతా చెడిపోతున్నది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు పార్కును అందుబాటులోకి తేవాలని స్థానికులు, చిన్నారులు కోరుతున్నారు.

అనువర్తిత జానపదంపై అధ్యయనం పెరగాలి

● జానపద సాహిత్యంపై జాతీయ సదస్సు షురూ


సదస్సు ప్రారంభం సందర్భంగా కళాశాలలో తెలుగు విభాగం అధ్యాపకులు, విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జానపద సాహిత్యం పునర్మూల్యాంకనం అనే అంశంపైన సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాల జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. బిరుదురాజు రామరాజు శతజయంతిని పురస్కరించుకుని తెలుగు విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు అంతర్జాల జాతీయ సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సు కన్వీనర్ తెలుగు శాఖాధ్యక్షుడు డా. మట్టా సంపత్ కుమార్ రెడ్డి ప్రారంభ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ మనుగడకు ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు ఎంతైనా అవసరమన్నారు. జానపద విజ్ఞాన సాహిత్యం నుంచి నేర్చుకోవలసినవి ఎన్నో ఉన్నాయన్నారు. ఆత్మీయ అతిథి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అధ్యక్షుడు సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ జానపదంలో కూడా జ్యోతిష్య స్పృహ ఉందన్నారు. కీలక ఉపన్యాసకులు, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి గిట్టే వరకు జానపద ఆచారాలనెన్నో మనిషి ఆచరిస్తాడన్నారు. విశిష్ట అతిథి కంచి విజయలక్ష్మి బిరుదు రాజు రామరాజు సాహిత్యం జీవితం గురించి తెలియజేశారు. ప్రత్యేక అతిథి రామరాజు కూతురు బిరుదు రాజు పద్మావతి మాట్లాడుతూ తన తండ్రి నుంచి నేర్చుకున్న సాహిత్యం వల్ల గ్రూప్ వన్ ఉద్యోగాన్ని సాధించగలిగానన్నారు. కార్యక్రమంలో సమన్వయ కర్త పిట్ల దాసు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.పి.అయిల్లో రెడ్డి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డా. మధుసూదన్, నారోజు వెంకట రమణ, చక్రహరి రమణ, సంపత్, రామస్వామి, నరేష్, శైలజ, నర్సింహులు, డా.ఉమా మహేశ్వరి, అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌తో రక్తమోడుతున్న దండకారుణ్యం

● నక్సల్స్‌తో చర్చలు జరిపి ప్రజాసమస్యలు పరిష్కరించాలి

● అరుణోదయ విప్లవ సాంస్కృతోద్యమ ప్రజా గాయకురాలు విమలక్క


హుస్నాబాద్‌లో అమరుడైన సహదేవరెడ్డి కుటుంబంతో విప్లవ ప్రజాగాయకురాలు విమలక్క

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో రక్తమోడుతుందని, నక్సల్స్ గ్రహించి తాము చర్చలకు సిద్ధమని రావడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని, ఇరువైపులా చర్చలు జరిగి ఆ చర్చలతో ప్రజా సమస్యలు పరిష్కారం కావాలని ఆశిస్తున్నట్లు అరుణోదయ విప్లవ సంస్కృతోద్యమ గాయకురాలు విమలక్క అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణానికి చెందిన నక్సలేట్ రిక్కల సహదేవరెడ్డి కుటుంబాన్ని విమలక్క పరామర్శించి మాట్లాడారు. ఇరువర్గాల మధ్య శాంతి చర్చలు జరిగిన నాడు.. ప్రజల సమస్యలు నెరవేర్చిననాడు.. సమస్యలకు పరిష్కారం దొరికినపడు.. హుస్నాబాద్ రిక్కల సహదేవరెడ్డితో పాటు భారత విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరవీరులందరి కల నెరవేరినట్లన్నారు. అమరవీరుల ఆశయాల నెరవేర్చడానికి ఇక్కడ ఉన్న పౌరసమాజం ఆలోచన చేసి ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. అలాగే ముంచుకొస్తున్న ఫ్యాక్సిజానికి వ్యతిరేకంగా విశాల దక్పదంతో, విశాలమైన ప్రాతిపాదికపైన ఒక ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి కృషిజరగాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆవైపున పోరాడే వారందరి పక్షాన మనమంతా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా అమరులైన వీరులకు జోహార్లర్పించారు. ఆమె వెంట జేఏసీ నాయకులు మేకల వీరన్నయాదవ్, ముప్పిడి రాజిరెడ్డి, సహదేవరెడ్డి కుటుంబ సభ్యులు ఉన్నారు.

కుడి కంటి పైభాగంలో గుచ్చుకున్న స్క్రూ డ్రైవర్

● రెండు గంటల పాటు సర్జరీ ● తొలగించిన గాంధీ వైద్యులు


సర్జరీ ముందు


సర్జరీ తరువాత

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కుడి కంటి పైభాగంలో గుచ్చుకున్న స్క్రూ డ్రైవర్‌ను గాంధీ ఆస్పత్రి న్యూరాలజికల్ విభాగం వైద్యులు రెండుగంటల పాటు శ్రమించి తొలగించారు. బాధితుడిని ముప్పు నుంచి తప్పించారు. ఎలక్ట్రికల్ మెకినిక్‌గా పనిచేసే మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామానికి చెందిన రంజిత్ (20) ఈనెల 8వ తేదీన పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కుడికంటి పై భాగంలో స్క్రూ డ్రైవర్ గుచ్చుకుని లోతుగా చొచ్చుకుపోయింది. దీంతో కుటుంబ సభ్యులు అతని బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ కంటి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి తీవ్రంగా ఉండడంతో నిమ్స్‌కు రెఫర్ చేస్తూ పంపించారు. అయితే, నిమ్స్ వైద్యులు అతన్ని పరీక్షించి గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. గాంధీ ఆస్పత్రి నేత్ర వైద్యులు పలు పరీక్షలు చేసి ఎముకను చీల్చుకుని (ఫ్రంటల్ లోబ్) లోపలి వరకు స్క్రూ డ్రైవర్ చొచ్చుకుని పోయినట్లు గుర్తించారు. కంటి ఎలాంటి అపాయం కలగలేదని నేత్ర వైద్యులు నిర్ధారించారు. దీనిని తొలగించడానికి న్యూరోసర్జికల్ వైద్యులకు రెఫర్ చేశారు. రోగిని పరిశీలించిన న్యూరో సర్జికల్ వైద్య బృందం రెండు గంటల పాటు సర్జరీ చేసి రోగికి కంటి పై భాగంలో గుచ్చుకున్న స్క్రూ డ్రైవర్‌ను తొలగించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉందని, కంటి చూపునకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని వైద్యులు పేర్కొన్నారు.

సిద్దేశ్వర పటేల్ ఆమరణ నిరాహార దీక్షకు అండగా నిలవాలి

● బీసీ ఆజాదీ జేఏసీ చైర్మన్ బోయ రాములు, సామాజిక తెలంగాణ ఉద్యమ నాయకుడు మోహన్ రెడ్డి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బీసీ ఆజాదీ జేఏసీ చైర్మన్ బోయ రాములు

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్, 15(ఆంధ్రజ్యోతి): బీసీల సమస్యల సాధన కోసం తెలంగాణ బిడ్డ బత్తుల సిద్దేశ్వర పటేల్ ఢిల్లీలో చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు ప్రతి తెలంగాణ బిడ్డ అండగా నిలవాలని బీసీ ఆజాదీ జేఏసీ చైర్మన్ బోయ రాములు, సామాజిక తెలంగాణ ఉద్యమ నాయకుడు మోహన్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు రమేష్ అన్నారు. దేశవ్యాప్తంగా కులగనన చేయాలని, తెలంగాణలో బీసీలను తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న దీక్షను భగ్నం చేయడానికి పోలీసులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. బీసీ, మైనారిటీ, దళిత, బహుజనులకు కోసం ఆయన చేస్తున్న పోరాటానికి మద్దతుగా సిద్దిపేటలో సంఘీభావ సమావేశం నిర్వహించ తలపెట్టామని తెలిపారు. ఈ మేరకు కార్యక్రమం కరపత్రికను సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దబ్బెట శ్రీనివాస్, బీసీ ఆజాదీ జేఏసీ నాయకులు సత్యనారాయణ, వేణు, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు!

● కొత్తగా 119 మంది విధుల్లోకి..

● త్వరలో వారి చేతికి స్టీరింగ్

● డ్రైవర్ల కొరత దృష్ట్యా ఆర్టీసీ చర్యలు



సంగారెడ్డిలోని ఆర్టీసీ కొత్త బస్టాండ్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : టీజీఎస్ ఆర్టీసీలో డ్రైవర్ల కొరతను తీర్చేందుకు ఆ సంస్థ చర్యలు తీసుకున్నది. రోడ్డు రవాణా సంస్థలో రెగ్యులర్ డ్రైవర్ల నియామకాలు జరగక ఏళ్లు గడుస్తున్నది. ఏటా పదుల సంఖ్యలో డ్రైవర్లు ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీలు ఏర్పడుతున్నాయి. దీంతో మెదక్ రీజియన్ వ్యాప్తంగా ఉన్న వివిధ ఆర్టీసీ డిపోల్లో డ్రైవర్ల కొరత ఏర్పడుతున్నది. ఈ సమస్యను అధిగమించేందుకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపాదికన కాంట్రాక్ట్ పొంది ఆర్టీసీ డ్రైవర్ల నియామకానికి అవసరమైన చర్యలకు ఉపక్రమించింది. ఇదిలా ఉండగా మెదక్ రీజియన్ వ్యాప్తంగా సుమారు 990 డ్రైవర్ పోస్టుల మంజూరి ఉండగా ఉద్యోగ విరమణలతో క్రమక్రమంగా డ్రైవర్ల కొరత ఏర్పడడంతో తాజాగా ఆ సంస్థ 119 మంది డ్రైవర్లను నియామకానికి చర్యలు తీసుకుంది. ఇప్పటికే వారు శిక్షణలో ఉండగా త్వరలో వారు ఆర్టీసీ బస్సు స్టీరింగ్ పట్టనున్నారు. ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల నియామకంతో మెదక్ రీజియన్ వ్యాప్తంగా డ్రైవర్ల కొరత కొంత మేర తీరిందని రీజినల్ మేనేజర్ ప్రభులత తెలిపారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గజ్వేల్ ఆర్‌అండ్ఆర్ కాలనీ బ్రాహ్మణ బంజేర్‌పల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్రాహ్మణ బంజేర్‌పల్లికి చెందిన మద్దురిసాయిలు కూతురు పెళ్లికి, ఇల్లు నిర్మాణానికి అప్పులు చేశాడు. దానికితోడు అనారోగ్య సమస్య తలెత్తడంతో ఏం చేయాలో తెలియక మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 12న ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం గజ్వేల్ మండలం సంగాపూర్ గ్రామ శివారులోని బావిలో అతడి మృతదేహం పైకి తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి..


ఐలయ్య (ఫైల్)

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని బయ్యారం గ్రామానికి చెందిన కామల్ల ఐలయ్య(40) తాగుడుకు బానిసై ఏ పనిచేయకుండా తిరుగుతున్నాడు. ఈ నెల 8న తాగిన మత్తులో ఇంటి వద్ద ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య మొదట గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

గొంతెండకుండ



సిద్దిపేటలో నిమ్మరసం పంపిణీ చేస్తున్న బొంగు రాజేందర్‌రెడ్డి

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేయించారు.

- నారాయణఖేడ్ ప్రాంతంలో జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్ గత నెలరోజులుగా ఉపాధిహామీ కూలలకు మొబైల్ వాహనాల ద్వారా అంబలి పంపిణీ చేయిస్తున్నారు.
- సిద్దిపేట రూరల్ మండలం బండచర్లపల్లిలో పోతరాజు రమేశ్, వెంకటాపూర్‌లో బచ్చుగాని మంజుల, నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో పార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఉన్నాయి.
- మనోహరబాద్ మండలం పరికిబండలో మంచా శ్రీరామ్, కోనాయిపల్లిలో మన్నె కళ్యాణ్‌లు చలివేంద్రాలను ఏర్పాటు చేసి నీళ్ల పంపిణీ చేస్తున్నారు.
- సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని జ్యోతిర్వస్తు విద్యాపీఠం వద్ద అంబలి పంపిణీ జరుగుతున్నది.
- శివ్వంపేట మండల కేంద్రంలో పులిమామిడి స్రవంతి నవీన్‌గుప్తా ఆధ్వర్యంలో నిరంతరంగా మినరల్‌వాటర్‌ను అందిస్తున్నారు.
- సిద్దిపేట వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీనివాస సేవాసమితి ఆధ్వర్యంలో అంబలి, కమాన్ సమీపంలో పార్వతిమాత ఫ్యామిలీ యూత్ అసోసియేషన్, వాసవిమాత ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.
- రాయికోడ్‌లో శాంతిఫౌండేషన్, ఏబినేజర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు నడుస్తున్నాయి.
- ఝరాసంగంలో విజయ్ అనే వ్యక్తి తన సొంత డబ్బులతో చలివేంద్రం ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచాడు.
- జహీరాబాద్ పట్టణంలో వెంకటేశ్వర షాపింగ్ మాల్ నిర్వాహకులు ప్రతీ వేసవిలో అంబలి, మజ్జిగ పంపిణీ చేస్తారు. సఫైబైతుల్ మాల్ స్వచ్ఛంద సంస్థ తరపున ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్, పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో మంచి నీటిని అందిస్తున్నారు.
- చిన్నకోడూరు మండలం రామునిపట్లలో పంతం శ్రీలత,సంతోష్‌లు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- సంగారెడ్డిలోని చందన బ్రదర్స్, కొత్త బస్టాండ్ సమీపంలో గల రాందేవ్ గిఫ్ట్ ఆర్టికల్ ఆధ్వర్యంలో కూల్‌క్యాన్ల ద్వారా నీళ్లందిస్తున్నారు.
- నార్సింగి మాజీ సర్పంచ్ ఎర్రం అశోక్ తన తల్లి దండ్రుల జ్ఞాపకార్థం వేసవి దృష్ట్యా మినరల్ వాటర్ అందిస్తున్నారు.
- మెదక్‌లో గత పదేళ్లగా రాజరాజేశ్వరి మెడికల్ షాపు యజమాని రవీందర్ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.
- తూప్రాన్ పట్టణానికి చెందిన కివరాం, పోల మాణిక్యంలు సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ప్రతీరోజు మధ్యాహ్నం అంబలి కేంద్రం నిర్వహిస్తున్నారు.
- చేర్యాలలో మాజీ మంత్రి నిమ్మ రాజిరెడ్డి మనవడు అఖిల్‌రెడ్డి చలివేంద్రం ఏర్పాటు చేశారు.


తూప్రాన్ పట్టణంలో అంబలి పంపిణీ

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు

న్యూస్ నెట్‌వర్క్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించడంతో పాటు బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం ప్రాధాన్యత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు మంచి పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. అప్పుడే పుట్టిన శిశువుకు ముర్రుపాలు పట్టడంతో పాటు ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించాలన్నారు. గర్భిణులు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలోనే ఒకపూట సంపూర్ణ భోజనాన్ని తినాలని, పిల్లలకు బాలామృతం తినిపించాలని సూచించారు. గర్భం దాల్చిన నుంచి పిల్లలకు రెండేళ్ల వయసు వచ్చే వరకు ఇవ్వాల్సిన పోషకాహారంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ వైద్యుల సలహాలను పాటించాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అమలు చేస్తున్న ఒకపూట సంపూర్ణ భోజనం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


నారాయణరావుపేట: గ్రామ పంచాయతీ కార్యాలయంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేస్తున్న సీడీపీవో శారద


జగదేవ్‌పూర్: తీగుల్‌లో గర్భిణులకు సామూహిక సీమంతాలు


మద్దూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత


మర్కుక్: ఎర్రవల్లిలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో చిరుధాన్యాలను రుచి చూస్తున్న సీడీపీవో సరిత తదితరులు



కుకునూరుపల్లి: పోషణ పక్షోత్సవాల్లో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో రమాదేవి

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

సిద్దిపేట, ఏప్రిల్ 15: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో కలిసి సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్పీలు వార్డుల్లో పర్యటిస్తూ పట్టణంలో ప్లాస్టిక్ నిషేధానికి మహిళాసంఘాల సభ్యులు ముందడుగు వేయాలని, టిఫిన్ సెంటర్‌లు, హోటళ్లు, పండ్లు, పాల వ్యాపారులు, మార్కెట్‌లలో ప్లాస్టిక్ వాడకంతో జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఎకోలాస్టిక్ కవర్లను వినియోగించేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ వినియోగించే వారికి జరిమానా వేసే బదులుగా, జరిమానా విధించే డబ్బులతో ఎకోలాస్టిక్ కవర్లను వాడుకునేలా చూడాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో సంతోషి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

ఫోర్జరీ చేసిన సిబ్బందిపై కేసు నమోదు చేయాలి

సిద్దిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మహిళాసంఘం పేరిట రుణాలు పొందేందుకు సంఘం సభ్యుల సంతకం ఫోర్జరీ చేసిన మెప్మా సిబ్బందిపై అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మహిళాసంఘాలకు అందజేసిన రుణాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌కు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయసుద్దీన్, నజ్జు, విజయ్ డేనియల్ తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

దళారులను నమ్మి మోసపోవద్దు

మిరుదొడ్డి/బెజ్జంకి/మద్దూరు/నంగునూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లోని పలు మండలాల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యదర్శి కమలాకర్ ప్రారంభించారు. బెజ్జంకి మండలంలోని గూడెం, వడ్లూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ ప్రారంభించారు. మద్దూరు మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్యా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాలు పట్టే జల్లిని, తేమను పరిశీలించారు. అనంతరం చేర్యాల డీఎంవోతో మాట్లాడి అదనంగా తాలుపట్టే మిషన్‌ను రెండు రోజుల్లో పంపించాలని తెలిపారు. నంగునూరు మండలం పాలమాకుల కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం మహిపాల్ మంగళవారం సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. రేపటి నుంచి రాజగోపాల్ పేట, ముంద్రాయి, అంక్షాపూర్, ఖాతా, గట్ల మల్యాల గ్రామాల్లో నిర్ణీత తేమ శాతం వచ్చిన ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు.


బెజ్జంకి: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఏస్, ఏఎంసీ చైర్మన్

అరటిపండ్ల గోదాంను పరిశీలించిన ఏసీపీ


దగ్ధమైన గోదాంను పరిశీలిస్తున్న ఏసీపీ మధు

కొండపాక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్పడగ శివారులో ప్రమాదవశాత్తు సోమవారం రాత్రి నిప్పంటుకుని దగ్ధమైంది. మంగళవారం సిద్దిపేట ఏసీపీ మధు, 3 టౌన్ సీఐ విద్యాసాగర్‌తో కలిసి దగ్ధమైన అరటిపండ్ల పండ్ల గోదాంను పరిశీలించారు. పూర్తిగా ఖాళీ బూడిద కావడంతో బాధితుడు తీవ్రంగా నష్టపోయాడు. సుమారు రూ. కోటికి పైగా నష్టం వాటిల్లినట్టు గోదాం యజమాని తెలిపాడు.

విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలి



పాలీసెట్ ఉచిత తరగతులను ప్రారంభిస్తున్న ఏబీవీపీ నాయకులు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ సిద్దిపేటశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సంజీవని పారా మెడికల్ కళాశాలలో మంగళవారం పేద విద్యార్థుల కోసం పాలీసెట్ ఉచిత బోధనా తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏబీవీపీ రాష్ట్ర సహ సంఘటన కార్యదర్శి విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక స్పృహను కలిగి ఉండాలన్నారు. ఏబీవీపీ విద్యారంగ సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు చేస్తూనే మరొక పక్క నిర్మాణాత్మక సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్నదన్నారు. అన్ని వర్గాల విద్యార్థుల శ్రేయస్సు కోసం ఏబీవీపీ పనిచేస్తుందన్నారు. ఉచిత బోధనా తరగతులు నిర్వహిస్తున్న సిద్దిపేట ఏబీవీపీ శాఖను వారు అభినందించారు. నిరుపేద విద్యార్థులు ఈ ఉచిత బోధనా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట మెదక్ జిల్లాల సంఘటన మంత్రి లక్ష్మీపతి, సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఆదిత్య, నగర సంఘటన మంత్రి జగదీష్, నగర కార్యదర్శి పరశురాం, పాలిసెట్ కన్వీనర్ అనీష్, మహిళా కన్వీనర్ వర్షిని, పాలీసెట్ కో కన్వీనర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమపథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తొగుట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మంగళవారం దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సన్న బియ్యం లబ్ధిదారుల ఇంట్లో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని సూచించారు.వెంట మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు స్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళం

నంగునూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నంగునూరులో గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో పెద్ద తాటి వనంలో నిర్మించనున్న ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నేత గాదగోని చక్రధర్‌గౌడ్ తనవంతు సహాయంగా సోమవారం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం గౌడ సంఘం సభ్యులు కోల సతీష్ గౌడ్, తాళ్లపల్లి వీరయ్య గౌడ్, రాజు, శివ ప్రసాద్ గౌడ్ ల సమక్షంలో నగదు అందజేశారు. ఆలయ నిర్మాణం కోసం సహకరించిన చక్రధర్ గౌడ్‌కు సంఘం తరఫున గీత కార్మికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పేదింటి వధువుకు సాయం

మిరుదొడ్డి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పెద్దోళ్ల లక్ష్మి కూతురు వివాహానికి మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర యువజన సీనియర్ నాయకుడు మహేష్‌రెడ్డి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

ఎల్లమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే

రాయపోల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో ఎల్లమ్మ వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశిస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

అర్హులకే ఇళ్లను కేటాయించండి

చిన్నకోడూరు, ఏప్రిల్ 15: (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు శివారులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో చాలా ఇళ్లు ఖాళీగా ఉండటంతో భయాందోళనలకు గురవుతున్నామని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్లలో ఉండటం లేదని వారు పేర్కొన్నారు. ఈ మేరకు వారు మంగళవారం చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామానికి సుమారు 3 కి.మీ. దూరంలో 48 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రభుత్వం నిర్మించి పంపిణీ చేసిందన్నారు. అందులో కేవలం 15 ఇళ్లలో మాత్రమే లబ్ధిదారులు నివసిస్తున్నారన్నారు. అనర్హుల పట్టాలు రద్దు చేసి అసలైన అర్హులకు అందజేయాలని కోరారు.

రజతోత్సవ సభకు తరలి రండి: ఎమ్మెల్యే


దౌల్తాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే

దౌల్తాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలను పెద్ద ఎత్తున తరలించేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు కంకణబద్ధులై పనిచేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 27న వరంగల్ లోని ఎల్కతుర్తి గ్రామంలో జరిగే రజతోత్సవ సభపై ఆదివారం దౌల్తాబాద్ మండల కేంద్రంల వీఆర్ఆర్ గార్డెన్ లో బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. అంతకుముందు బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి రజతోత్సవ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు ఎంపీలు రోజూ ఏదో ఒక చోట అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగేవని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని ఎద్దేవా చేశారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

ఈ నెల 13న ముబారస్పూర్ గ్రామ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో తాను జెండా కింద పడేయలేదని ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. జెండా కింద పడితే తొక్కుతారని భావించి కింద ఉన్న ఓ వ్యక్తికి జెండా పట్టుకొమ్మని క్యాచ్ విసిరితే పట్టుకున్నాడన్నారు. సోషల్‌మీడియాలో కొంతమంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు జెండా కింద పడేసినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి పనికిమాలిన పనులు మానుకోవాలని హితవు పలికారు. ముబారస్పూర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో తాను ఏదైనా తప్పు చేసినట్లయితే క్షమించమని కోరుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సయ్యద్ రైమొద్దిన్, బీఆర్ఎస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చేర్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పోలీస్‌స్టేషన్ సమీపంలోని చౌరస్తా వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. యాదాద్రి జిల్లా సాదువెల్లి గ్రామానికి చెందిన కనకయ్య చేర్యాల మండలం గుర్జకుంట గ్రామంలో జరిగిన బీరప్ప పండుగ సందర్భంగా తమ బంధువుల ఇంటికి వెళ్లి మంగళవారం సాయంత్రం బైక్‌పై తిరుగుప్రయాణమయ్యాడు. అదే సమయంలో పోలీస్‌స్టేషన్ పక్కవీధి నుంచి బైక్‌పై సత్తయ్య వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్తుండగా, ప్రమాదవశాత్తు బైక్‌లు ఢీ కొన్నాయి. దీంతో ఇరువురికి గాయాలై రక్తస్రావం జరిగింది. స్థానికులు 108అంబులెన్స్ ద్వారా చేర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కనకయ్యను మెరుగైనచికిత్స కోసం మరో ఆసుపత్రికి తరలించారు.


గాయపడిన కనకయ్య

రజతోత్సవ సభ కోసం కూలీ పని..


సిద్దిపేటలో ఓ హోటల్ వద్ద మిర్చి బజ్జీలు వేస్తూ కూలీ పని చేస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న భారత రాష్ట్ర సమితి చలో వరంగల్ కేసీఆర్ గారి భారీ బహిరంగ సభకు నిధి సేకరణలో భాగంగా మంగళవారం సిద్దిపేట పట్టణంలోని గౌరీ మిర్చి బండి వద్ద సిద్దిపేట నియోజకవర్గ బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఒక్కరోజు కూలీ పనులు చేశారు. ఈ మేరకు పనిచేసినందుకు హోటల్ నిర్వాహకులు కూలీ రూ. 3 వేలు అందించినట్లు యువజన విభాగం సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపు మేరకు సిద్దిపేట నియోజకవర్గ యువజన విభాగం ఆధ్వర్యంలో మిర్చీ బండివద్ద కూలీ పని చేసి సభ నిర్వహణకు తమవంతుగా కృషిచేస్తున్నామని చెప్పారు.

మెడికల్ బిల్లులు త్వరగా మంజూరు చేయండి


జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులు త్వరగా మంజూరు చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అదరాసుపల్లి శశిధరశర్మ కోరారు. గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణకు పీఆర్టీయూ నాయకులతో కలసి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు త్వరగా పరిశీలించి పంపించాలని కోరారు. జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ అన్నపూర్ణ అడిషనల్ డైరెక్టర్ జయశ్రీతో ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ అన్నపూర్ణ మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బంది కలుగకుండా చూస్తామని తెలిపారు. వారితో గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి తీగుళ్ల లింగం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జానకిరామ్‌రెడ్డి, ఊడెం వేమారెడ్డి, కుకునూరు శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బ వెంకటేశ్, నాగరాజు ఉన్నారు.

'ఇస్రో యువ విజ్ఞాన్'కు ముగ్గురు మోడల్‌స్కూల్ విద్యార్థులు

మిరుదొడ్డి,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):దుబ్బాక మున్సిపాలిటీలోని లచ్చపేట మోడల్ స్కూల్ చెందిన హర్షవర్ధన్, కౌశిక్, సుశాంక్ అనే ముగ్గురు విద్యార్థులు ఇస్రో నిర్వహించే యువవిజ్ఞాన్ కార్యక్రమానికి ఎంపికయ్యారు. మంగళవారం లచ్చపేటలోని మోడల్ స్కూల్‌చెందిన విద్యార్థులను, గైడ్ ఉపాధ్యాయురాలు జ్యోతిలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సాదత్‌అలీ శాలువతో సన్మానించారు. వచ్చే నెల 18 నుంచి 15 రోజుల పాటు ఇస్రో ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వీరు ఉపగ్రహ నిర్మాణం, రాకెట్ లాంచింగ్, అంతరిక్ష పరిజ్ఞానంపై ప్రాథమిక అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.

15వేల మందితో వరంగల్ సభకు తరలివెళ్తాం



గజ్వేల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్/వర్గల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గం నుంచి 15వేల మందితో వరంగల్‌కు తరలివెళ్తామని శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పరిధిలో, వర్గల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభ సందర్భంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలోని 20 వార్డులతో పాటు మల్లన్నసాగర్ ముంపు గ్రామాల్లో బీఆర్ఎస్ గద్దెలను ఏర్పాటు చేసి జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయి ఉన్నార ని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టడం ఖాయమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, హామీలపై బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులను ఎక్కడబడితే అక్కడ నిలదీయాలన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, జాఫర్ ఖాన్, ఆయా వార్డుల తాజా మాజీ కౌన్సిలర్లు, వర్గల్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

● బెజ్జంకి/చేర్యాల/మద్దూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి మండల కేంద్రంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నిర్మల, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కచ్చు రాజయ్య, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. చేర్యాలలో మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సభకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే తాడూరు తదితర గ్రామాల్లో ఎంపీపీ పల్లంపల్లి కరుణాకర్, పెడుతల ఎల్లారెడ్డి, ముస్త్యాల రాజేశ్ తదితరులు పాల్గొనివాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. మద్దూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంతోష్ పార్టీ నాయకులతో కలిసి రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

రాజ్యాంగ పరిరక్షణకే కాంగ్రెస్ పాదయాత్ర

సిద్దిపేట రూరల్/ మిరుదొడ్డి, ఏప్రిల్ 15(ఆంధ్ర జ్యోతి): భారత రాజ్యాంగ పరిరక్షణ కోసమే కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర చేపట్టిందని మండల పార్టీ అధ్యక్షులు గరిపల్లి రాములు అన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల, బండచేర్లపల్లి గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం పై చేస్తున్న కుట్రలను ప్రజలందరూ ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షుడు కలీమొద్దిన్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బండి శివకుమార్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గ్యార రఘుపతి, నాయకులు పాల్గొన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి, బేగంపేట, ఖాజీపూర్ గ్రామాల్లో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామిగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సంవిధాన్ పాదయాత్రను నిర్వహించారు. రాజ్యాంగాన్నిరక్షించాలంటే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు బాల్‌నర్సాగౌడ్, కమలాకర్, నాయకులు తదితరులున్నారు.


సిద్దిపేట రూరల్: రావురూకులలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు జీవో అమలు చేసిన సందర్భంగా ఎమ్మార్పీఎస్, బాబు జగ్జీవన్‌రామ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేటలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు బయ్యారం ఇస్తారి, జువ్వన శంకర్, పెర్క పరశురాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ జీవో అమలు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, నరేష్, యాదగిరి, మహేందర్, నర్సింలు, శివకుమార్, రమేష్, శ్రీనివాస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లోని ఇందిరాపార్కు చౌరస్తాలో ఈ నెల 16న ఏర్పాటు చేయనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు జంగం రమేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. గజ్వేల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డిల ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా ఘనపూర్‌లోని మెడిసిటీ ఆసుపత్రి సౌజన్యంతో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

ఇంటర్ స్టేట్ ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

వర్గల్/హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఈ అభ్యాస్ ఐఐటీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి గ్లోబల్ ఒలంపియాడ్ ఐఐటీ పోటీ పరీక్షల్లో వర్గల్, హుస్నాబాద్ మండలాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి అవార్డులు అందుకున్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్ భారతీయ విద్యాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో డీఆర్డీవో మాజీ చైర్మన్ డా. సతీష్‌రెడ్డి, డా. ఫణిపవన్ విజేతలకు అవార్డులను అందజేశారు. వర్గల్ మండలం నెంటూర్ విశ్వశాంతి విద్యానికేతన్ విద్యార్థులు 20 మంది విద్యార్థులు అవార్డులు సాధించారని, అందులో మొదటి బహుమతి 8 మంది, రెండవ బహుమతి 7 మంది, మూడవ బహుమతి 5 మంది విద్యార్థులు అవార్డులు అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ దేవి దయాకర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి ఐఐటీ ఆరు రకాల పోటీ పరీక్షల్లో హుస్నాబాద్‌కు చెందిన సీవి రామన్ హైస్కూల్ విద్యార్థులు బుర్ర శ్రీనిధి, నాగిరెడ్డి సాయి, నివేష్‌రెడ్డి ప్రథమ బహుమతులు సాధించగా, జి అస్మ్య ఆనంద్, ఏ శ్రీచరిత, జి అరుష్ ద్వితీయ, బి రిక్షిత్, కె కౌషిక్, ఏ మనోజ్ఞరెడ్డి, ఎం సంక్షిప్త్, జి ప్రీతిక తృతీయ బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ కాయిత నారాయణరెడ్డి తెలిపారు. బహుమతుల ప్రదానోత్సవంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టీజీపీఎస్సీ మాజీ అధ్యక్షుడుబి జనార్ధన్‌రెడ్డి, ప్రముఖ దర్శకుడు ఎస్ మీర్ పాల్గొన్నారు.